DYNAMIC EDITION
# వాయిస్ టుడే
www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com
జనగాత్రం - మననేత్రం
Follow
పేజీలు 2
శుక్రవారం, నవంబరు 3, 2023
HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## ఎన్నికల్లో పోటీ చేయట్లేదు: షర్మిల



హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉంటున్నట్లు వైఎస్సార్టీపీ అధినేత వైఎస్ షర్మిలా రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి షర్మిలారెడ్డి లేఖ రాశారు. బీఆర్ఎస్ నీచపాలన అంతం కోసం ఎటువంటి కఠిన నిర్ణయానికైనా సిద్ధమని స్పష్టం చేశారు. కేసీఆర్ అవినీతి రౌడీరాజ్యం అంతమొందించగలిగే కాంగ్రెస్ ఓటు చీల్చవద్దనే ఈ త్యాగం అని చెప్పుకొచ్చారు. తెలంగాణ బాగు, భవిత కోసం వైఎస్సార్ తెలంగాణ పార్టీ అసెంబ్లీ ఎన్నికల నుంచి వైదొలగుతోంది అంటూ రాహుల్ గాంధీకి రాసిన లేఖలో షర్మిల పేర్కొన్నారు. ఈ లేఖను షర్మిల ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు.



## బీఆర్ఎస్‌లో చేరిన కాసాని జ్ఞానేశ్వర్

సిద్దిపేట: బీఆర్ఎస్ పార్టీలో కాసాని జ్ఞానేశ్వర్ ) ముదిరాజ్ చేరారు. మర్కూర్ మండలం ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో శుక్రవారం నాడు సీఎం కేసీఆర్ సమక్షంలో జ్ఞానేశ్వర్ గులాబీ కండువా కప్పుకున్నారు. కేసీఆర్ జ్ఞానేశ్వర్‌ను సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. జ్ఞానేశ్వర్‌తో పాటు ఆయన అనుచరులు కూడా బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కీలక పదవీ ఇస్తానని కాసాని జ్ఞానేశ్వర్‌కు సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ…"ముదిరాజ్ సామాజిక వర్గంలో నాయకత్వం ఎదగాలి. గెలిచే నాయకులను పార్టీ గౌరవిస్తుంది.. గెలవలేని పరిస్థితుల్లో కులాల వారీగా టికెట్లు ఇస్తే పార్టీ నష్టపోతుంది. పద్మశాలి సామాజిక వర్గానికి సంబంధించి సంగారెడ్డిలో గత ఎన్నికల్లో చింతా ప్రభాకర్‌కు టిక్కెట్ ఇచ్చాం. చివరి వరకు పోరాడినా ఒడాం… మళ్లీ ఇప్పుడు ఆయనకే టిక్కెట్ ఇచ్చాం. ఎన్టీఆర్ హయాంలో బీసీల రిజర్వేషన్ ద్వారా కొంత ఎదిగారు. మాజీమంత్రి ఈటల రాజేందర్ పార్టీలోంచి వెళ్లాక.. పార్టీలోకి వచ్చిన పెద్ద నేత మీరు.. పార్టీలో మీకు తగిన గౌరవం ఉంటుంది. ఎన్నికలు అయిపోయాక ప్రశాంతంగా అన్ని విషయాలు మాట్లాడుకుందాం" అని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు.

## అందరి భాగోతాలు బయటపెడుతా: మైనంపల్లి



హైదరాబాద్ (వాయిస్ టుడే): మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు మల్కాజ్గిరి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మీడియా సమావేశం నిర్వహించారు. నా కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు క్యాడర్ కోసం పనిచేస్తా. ఆస్థలు అమ్మయినా సరే ప్రజాసేవలో ఉంటా. నా పైన వ్యక్తిగత విమర్శలకు దిగుతున్న మంత్రి ఖబర్దార్ అని హెచ్చరించారు. రాష్ట్రంలో ఇసుక మాఫియా, ప్రభుత్వ సీలింగ్ భూములను ఎన్నికలకు నెల రెండు నెలల ముందు ఎన్ఓసి తీసుకొని లక్షల కోట్ల రూపాయలు సంపాదిస్తున్నావు. వచ్చే కాంగ్రెస్ ప్రభుత్వంలో కచ్చితంగా బయటికి జైలుకు పంపుతాము. చిన్ననాటి నుంచి నీ స్థాయి ఏందో తెలుసు. హరీష్ రావు ముఖ్యమంత్రి కుటుంబ సభ్యుడివై ఉండి లక్షల కోట్ల రూపాయల అవినీతి పాల్పడుతున్నాం.. అవినీతికి పాల్పడే మంత్రి మల్లారెడ్డికి వారి అల్లుడికి టిక్కెట్ ఇచ్చి నాపై బురదల్లే ప్రయత్నం చేస్తే సహించేది లేదు. ఢిల్లీ హెూటల్ రూమ్లలో భాగవతాలు బయట పెడితే మీరు ఒక్కరు కూడా రోడ్ల తిరగదు. మల్లారెడ్డి నీది నీ అల్లుడుది క్లబ్బులు,పబ్బుల పొంటి. చరిత్ర అవసరమున్నప్పుడు బయట పెడతా ఖబర్దార్. ప్రజలారా ప్రతిదీ గమనించండి వారిచ్చిన డబ్బులు తీసుకోండి కాంగ్రెస్ గుర్తుకు ఓటేయండని అన్నారు. …



తెలంగాణలో ప్రజాస్వామ్యం లోపించింది

# కేసీఆర్ పాపాల పుట్ట పగిలింది.. మేడిగడ్డ కుంగింది

## టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి



హైదరాబాద్ (వాయిస్ టుడే): తెలంగాణ ప్రజలు కోరుకుంది స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అభివృద్ధి. కానీ రాష్ట్రం ఒక వ్యక్తి ఉక్కుపాదాల కింద నలిగిపోతోంది. అందుకే రాష్ట్ర ప్రజల కోసం నా వంతుగా నేను పోరాడుతున్నానని టీపీసీసీ ఛీఫ్ రేవంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం నాడు అయన బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన మీట్ ద ప్రెస్ కార్యాక్రమంలో పాల్గొన్నారు.

రేవంత్ మాట్లాడుతూ చరిత్ర చెప్పాలంటే క్రీస్తు పూర్వం.. క్రీస్తు శకం అని చెబుతాం. అలగే మన రాష్ట్రం గురించి చెప్పాలంటే తెలంగాణ వచ్చాక, తెలంగాణ రాకముందు అని చెప్పుకోవాలి. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారు. రాజకీయంగా నష్టపోతామని తెలిసినా.. ధర్మం వైపు నిలబడాలని రాష్ట్రం ఇచ్చారు. తెలంగాణ ప్రజలు కోరుకుంది స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అభివృద్ధి. కానీ రాష్ట్రం ఒక వ్యక్తి ఉక్కుపాదాల కింద నలిగిపోతోందని అన్నారు.

లెక్కలు వేసుకుని, స్వార్ధం చూసుకుంటే వంద మంది కేసీఆర్ లు వచ్చినా తెలంగాణ ఏర్పడేది కాదు. శ్రీకాంతాచారి లాంటి అమరుల త్యాగాలను గుర్తించి సోనియా తెలంగాణ ఇచ్చారు. దశాబ్దం గడిచినా నీళ్లు, నిధులు నియామకాలు సాధించుకున్నమా? ఒకసారి ఆలోచన చేయాలి. టీఆరెస్ ను పోలి ఉండేలా ఉండేందుకే వాహనాలకు టీజీ బదులు టీఎస్ అని పెట్టారు. రాష్ట్ర అధికారిక ముద్ర రాజరిక పోకడను తలపిస్తోంది. త్యాగాలను గుర్తు చేసేలా ఉండాల్సిన చిహ్నం రాచరికాన్ని తలపిస్తోంది. తెలంగాణ ప్రతీ తల్లి ప్రతీకలా తెలంగాణ తల్లి ఉండాలి. కానీ శ్రీమంతులు తెలంగాణ తల్లిని మనకు కేసీఆర్ చూపిస్తుండు. త్యాగాల పునాదులపై ఏర్పడిన తెలంగాణలో రచరికపోకడ కొనసాగుతోంది.తెలంగాణలో ప్రజాస్వామ్యం లోపించింది. ప్రజల హక్కులను కేసీఆర్ కాలరాశారు. రాష్ట్రంలో అందరినీ వర్గ శత్రువులా కేసీఆర్ చూస్తున్నారు. ఎన్నుకున్న ప్రభుత్వానికి ప్రజలు తమ బాధలు చెప్పుకోలేని పరిస్థితి. గతంలో పాలకులు ప్రజలకు సచివాలయంలో అందుబాటులో ఉండేవారు. కానీ ఇవాళ ప్రతిపక్ష నేతలకు, జర్నలిస్టులకు సచివాలయంలోకి ప్రవేశం లేదు. కేసీఆర్ నియంత ముసుగులో ఉన్న క్రిమినల్ పొలిటీషియన్. మార్పు జరగకుండానే ఉద్యమకారుల జీవితాలు తారుమారయ్యాయి. ఆత్మహత్య చేసుకున్న యువతులపై ప్రభుత్వమే తప్పుడు ప్రకటనలు చేస్తున్న పరిస్థితి. కేసీఆర్ పాపాల పుట్ట పగిలింది.. మేడిగడ్డ కుంగింది. కేసీఆర్ ఇచ్చిన ఏ హామీనీ ఈ పదేళ్లలో నెరవేర్చలేదు. ప్రజలని మోసం చేసిన కేసీఆర్ లాంటి మోసగాళ్లకు తెలంగాణలో స్థానం లేదు. పదేళ్లలో ఎవరి భవిష్యత్ బాగుపడింది.. ఎక్కడ బంగారు తెలంగాణ? కర్ణాటకలో కాంగ్రెస్ గెలవద్దని ప్రచారం చేశారు.. అంటే పరోక్షంగా కేసీఆర్ కోరుకుంది మోదీ గెలుపేనా అని అన్నారు. బీఆరెస్ నేతలవి లాజిక్ లేని వాదనలు.కేసీఆర్ తాను చేసింది చెప్పుకోలేక కాంగ్రెస్ నపై ఆరోపణలు చేస్తున్నారు. కేసీఆర్ వాదనల్లో డొల్లతనం స్పష్టంగా కనిపిస్తోంది. కాంగ్రెస్ ఎప్పుడూ మైనారిటీలను కేవలం ఓటు బ్యాంకుగా చూడలేదు. రైతులకు ఎకరానికి ఏటా 10వేలు ఇస్తామని 2014లోనే కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టింది. దాన్నే కాపీ కొట్టి కేసీఆర్ రైతు బంధు పేరుతో ఇస్తున్నారని అన్నారు.

### నేను కందిపప్పు.. కేటీఆర్ గన్నేరు పప్పు

**మంత్రి కేటీఆర్ కు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. నేను కందిపప్పు లాంటివాన్ని.. ఆరోగ్యానికి మంచిది. కానీ కేటీఆర్ గన్నేరు పప్పు లాంటివారు.. తింటే చస్తారని అన్నారు.**

**ఆరోగ్యం బాగుండాలంటే కందిపప్పు, ముద్దపప్పును తీసుకోండి.. గన్నేరు పప్పును కాదని అన్నారు.**



## డిసెంబర్ 23 నుంచి జనవరి 1 వరకు వైకుంఠ ద్వార దర్శనం

తిరుమల (వాయిస్ టుడే): వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయంలో ఈ ఏడాది డిసెంబర్ 23 నుండి జనవరి 1వ తేదీ వరకు 10 రోజులపాటు భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పిస్తున్నమని టీటీడీ ఈవో ధర్మరెడ్డి వెల్లడించారు. వైకుంఠ ఏకాదశి టిక్కెట్లను 300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లను ఈ నెల 10వ తేదీ విడుదల చేస్తారని అయన అన్నారు.

## నో మీడియా, నో ర్యాలీ

### స్కిల్ కేసులో హైకోర్టు తీర్పు

అమరావతి (వాయిస్ టుడే): చంద్రబాబు మధ్యంతర బెయిల్లో అదనపు షరతు అంశంపై హైకోర్టు శుక్రవారం తీర్పునిచ్చింది. చంద్రబాబు కార్యకలాపాల పరిశీలనకు ఇద్దరు డీఎస్పీలను పెట్టాలన్న సీఐడీ అభ్యర్థనను న్యాయస్థానం తిరస్కరించింది. స్కిల్ కేసు అంశాలపై మీడియాతో మాట్లాడవద్దని గతంలో ఇచ్చిన ఆదేశాలు కొనసాగుతాయి. రాజకీయ ర్యాలీలో పాల్గొనవద్దని గతంలో ఇచ్చిన ఆదేశాలు కొనసాగుతాయని హైకోర్టు స్పష్టం చేసింది.

INCOME TAX DEPARTMENT

## కేఎల్ఆర్ నివాసంలో నేడు కూడా కొనసాగుతున్న ఐటీ సోదాలు

హైదరాబాద్ : నార్సింగ్‌లోని కేఎల్ఆర్ నివాసంలో నేడు కూడా ఐటీ సోదాలు కొనసాగుతున్నాయి. రాత్రి 1గంట వరకూ ఐటీ బృందం సోదాలు జరిపించింది. ఇంట్లో లభ్యం అయిన డాక్యుమెంట్స్‌ని అధికారులు తీసుకెళ్లారు. మరో 15 మంది అధికారులతో ముమ్మర సోదాలు నిర్వహిస్తున్నారు. మాదాపూర్‌లోని కేఎల్ఆర్ హెడ్ క్వార్టర్స్ ఆఫీసులో సోదాలు కొనసాగుతున్నాయి. నిన్న రాత్రి ఫామ్ హౌజ్ సోదాలు ముగిసిన తర్వాత.. అక్కడ స్టేట్‌మెంట్‌ను అధికారులు నార్సింగ్ ఇంటికి తీసుకొచ్చారు. మరోసారి 5 వాహనాలలో లక్ష్మారెడ్డి ఇంటికి ఐటీ అధికారులు చేరుకున్నారు. సాయంత్రం వరకు సోదాలు జరిగే అవకాశం ఉంది.



## మైనస్ అవుతున్న కాళేశ్వరం

హైదరాబాద్, నవంబర్ 3, (వాయిస్ టుడే ): లక్ష30 వేల కోట్ల రూపాయల విలువ చేసే కాళేశ్వరం ప్రాజెక్టుకు మరో గండి పడింది. ఈ ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజి పిల్లర్లు కుంగిపోవడంతో అప్రతిష్ట పాలైన కెసీఆర్ ప్రభుత్వానికి మరో కొత్త సమస్య ఎదురైంది. తాజాగా అన్నారం బ్యారేజికి లీకేజి ఏర్పడింది. తెలంగాణలోని మరో బ్యారేజీలో లీకేజీ కలకలం సృష్టిస్తోంది. ఇటీవలే మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్ పిల్లర్లు కుంగిపోవడం, బ్యారేజీ గోడలకు బీటలు రావడం తెలిసిందే. ఈ ఘటన మరువక ముందే మరో బ్యారేజీలో లీకేజీ ఏర్పడింది. బ్యారేజ్ గేట్లు మూసేసినా కింద నుంచి ఊట ఉబికి రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఇసుక సంచులతో నీటి ఊటలను ఆపే ప్రయత్నం చేస్తున్నారు. విషయం బయటకు రావడంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా వాసులలో ఆందోళన వ్యక్తమవుతోంది. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన అన్నారం సరస్వతి బ్యారేజీ నీటి నిల్వ సామర్థ్యం 10.87 టీఎంసీలు. ప్రస్తుతం ఇందులో 5.71 టీఎంసీల నీటిమట్టం ఉంది. దీంతో ఒక గేటును ఎత్తి 2,357 టీఎంసీల నీటిని అధికారులు కిందికి విడుదల చేస్తున్నారు.మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజీలో పిల్లర్ నెంబర్ 15 నుంచి 20 వరకు ఇటీవల కుంగిపోయింది. బ్యారేజీ గోడలకు పగుళ్లు వచ్చాయని మీడియాలో కథనాలు ప్రసారమయ్యాయి. అధికారులు స్పందించి కుంగిన పిల్లర్లను పరిశీలించారు. కేంద్ర బృందం కూడా వచ్చి పరిశీలించింది. కాగా, లక్ష్మీ బ్యారేజీ నిర్మాణ దశలోనే 20వ నెంబర్ పిల్లర్ వద్ద పగుళ్లు వచ్చాయని అప్పట్లో ప్రచారం జరిగింది.

## గెజిట్ నోటిఫికేషన్ రిలీజ్

### నామినేషన్ల స్వీకరణ ప్రారంభం




హైదరాబాద్, నవంబర్ 2, (వాయిస్ టుడే): తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు కేంద్ర ఎన్నికల సంఘం కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది.గత అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థులు చేసిన పొరపాటులు ఈసారి పునరావృతం కాకుండా ఈసి పలు సూచనలు చేసింది.అయితే 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందిన వారిపై ప్రత్యర్థులు ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని కోర్టులను ఆశ్రయించడంతో ఎమ్మెల్యేగా గెలిచినా ఎన్నికల నియమావళిని పాటించనందుకు వారిని ఎమ్మెల్యేగా అనర్హులు అంటూ రెండు మూడు కేసులో కోర్టు తీర్పునిచ్చింది. ఈసారి అలాంటి తప్పులు తలెత్తకుండా అభ్యర్థులకు ఈసీ పలు సూచనలు చేసింది.



## నాడు కేసీఆర్‌పై పోటీ చేస్తానని చెప్పినట్టుగానే చేస్తున్నా

సిద్దిపేట, నవంబర్ 2, (వాయిస్ టుడే): గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని తిగుల్ నర్సాపూర్ గ్రామంలో శ్రీ కొండపోచమ్మ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారాన్ని బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. దమ్ముంటే రాజీనామా చేసి గెలిచి చూపించాలని కేసీఆర్ అంటే.. రాజీనామా చేసి గెలిచి చూపించానన్నారు. హుజురాబాద్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధర్మ యుద్ధం చేస్తే ఆ యుద్ధంలో ధర్మం గెలిచిందని.. తాను కూడా గెలిచానన్నారు. ఆనాడు గజ్వేల్‌లో మీ మీద పోటీ చేస్తానని చెప్పిన విధంగానే ఈరోజు మీపై పోటీకి దిగానన్నారు. కేసీఆర్ వేల కోట్లు ఖర్చుపెట్టినా కూడా మీకు స్వచ్ఛందంగా ఓట్లు వేసి గెలిపించుకుంటామని గజ్వేల్ ప్రజలు ఆశీర్వదిస్తున్నారని ఈటల పేర్కొన్నారు.

వాయిస్ టుడే
జనగాత్రం - మననేత్రం
హైదరాబాద్
శుక్రవారం, 3 నవంబరు, 2023

# కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో ముగిసిన రాజశ్యామల యాగం



**సశాస్త్రీయంగా మహా పూర్ణాహుతి**

**తెలంగాణకు మంచి జరగాలని కోరుకున్నామన్న స్వరూపానందేంద్ర**

ఎర్రవల్లి (వాయిస్ టుడే): ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో విశాఖ శ్రీ శారదాపీఠం చేపట్టిన రాజశ్యామలా సహిత సుబ్రహ్మణ్యేశ్వర యాగం ముగిసింది. వైదిక నియమాలను అనుసరిస్తూ మూడు రోజులపాటు యాగాన్ని నిర్వహించారు. శుక్రవారం మధ్యాహ్నం మహా పూర్ణాహుతితో యాగ క్రతువు పూర్తయింది. తెలంగాణ ప్రజలందరినీ రాజశ్యామల అమ్మవారు అనుగ్రహించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ యాగాన్ని నిర్వహించారని పీఠాధిపతులు స్వరూపానందేంద్ర స్వామి తెలిపారు. తెలంగాణ అభివృద్ధికి కంకణం కట్టుకున్న నాయకుడు కేసీఆర్ అని ప్రశంసించారు. సశాస్త్రీయంగా యాగాన్ని పూర్తి చేసామని స్పష్టం చేసారు. ఈ యాగంతో తెలంగాణలో అద్భుత ఘట్టం ఆవిష్కృతం అవుతుందని చెప్పారు. మహా పూర్ణాహుతి అనంతరం యాగంలో మంత్రించిన జలాలను కేసీఆర్ దంపతులపై చల్లారు. యాగ భస్మాన్ని కేసీఆర్ నుదుట దిద్దారు

**వేదోక్తంగా మహా పూర్ణాహుతి**

యాగశాలలో రాజశ్యామల అమ్మవారు శుక్రవారం నర్తనకాళి అలంకరణలో దర్శనమిచ్చింది. వేకువజాము నుంచే రాజశ్యామల, సుబ్రహ్మణ్యేశ్వర మూల మంత్రాల హవనం ప్రారంభమైంది. పూర్ణాహుతి ముహూర్త సమయానికి నిర్దిష్ట సంఖ్యలో హవనాలను పూర్తి చేసారు. మహా పూర్ణాహుతిలో కేసీఆర్ దంపతులతో పాటు బంధుమిత్రులు, సన్నిహితులు పాల్గొన్నారు. పూర్ణాహుతిలో వినియోగించే పసుపు, కుంకుమ, సుగంధ ద్రవ్యాలకు పీఠాధిపతులు స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర సమక్షంలో కేసీఆర్ దంపతులు పూజలు చేసారు. అష్టదిక్పాలకులకు ఆర్ఘ్యం సమర్పించారు. అనంతరం పూర్ణాహుతి జరిపారు. కేసీఆర్ దంపతులు ధరించిన కంకణాలను విసర్జించడం ద్వారా యాగం పూర్తయింది. అనంతరం స్వరూపానందేంద్ర స్వామికి పాదపూజ చేసి కేసీఆర్ పుష్పాభిషేకంతో గురు వందనం సమర్పించారు. ఈసందర్భంగా శూలినీ దుర్గ కవచంతో అభిమంత్రించిన రక్షను స్వరూపానందేంద్ర స్వామి కేసీఆర్కు కట్టారు. అలాగే విశాఖ శ్రీ శారదాపీఠం నుండి ప్రత్యేకంగా రప్పించిన రాజశ్యామల అమ్మవారి శేష వస్త్రాలను స్వరూపానందేంద్ర స్వామి కేసీఆర్ దంపతులకు అందించారు.



# బీఆర్ఎస్ సర్కార్‌లోనే ఆధ్యాత్మికతకు గుర్తింపు

**ఆధ్యాత్మిక చింతనతోనే సమసమాజం బాగుంటుంది**

**బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్**

మంథని (వాయిస్ టుడే): బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే అధ్యాత్మకతకు గొప్ప గుర్తింపు లభిస్తోందని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ అన్నారు. మంథని పట్టణంలోని నృసింహ శివ కిరణ్ గార్డెన్స్‌లో శ్రీ జనార్థన సరస్వతీ స్వామి సంస్కృతి ట్రస్టు ఆధ్వర్యంలో ప్రముఖ వ్యాపార వేత్త గట్టు నారాయణగురూజీ సౌజన్యంతో జరుగుతున్న వేద విద్యార్థులకు వేద పరీక్షలు నిర్వహించే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వేదాలకు పుట్టినిల్లుగా పేరుగాంచిన మంథనిలో వేద పాఠశాల లేకపోవడంపై ఆలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని కులాలు, మతాలు సమానమని చాటి చెప్పే ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యాత్మికతకు ప్రాధాన్యత ఇస్తారని, ఏ కార్యక్రమం చేపట్టినగా ముందుగా హెూమ కార్యక్రమం చేపట్టడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఆధ్యాత్మిక చింతనతోనే సమసమాజం బాగుపడుతుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. మర్చిపోయిన మారిపోయిన మంథని ప్రాంతంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. గట్టు నారాయణగురూజీ ఈప్రాంతంపై ఉన్న ప్రేమతో అనేక కార్యక్రమాలు చేపట్టారని ఆయన గుర్తు చేశారు. ఒక సమయంలో మజీదు నిర్మాణానికి రూ.50వేలు అందించిన ఘనత ఆయనదేనని అన్నారు. ఇతర కులాల వారిని ద్వేషించవద్దని, దూరం చేసుకోవద్దనే ఆలోచన ఆయనదని కొనియడారు. తన హయాంలోమంథని గొప్పతనాన్ని, విశిష్టతతో పాటు ఆలయ భూములను రక్షిస్తూ ఆచారాలను కాపాడుకుంటూ ముందుకు వెళ్లామని ఆయన అన్నారు. మంథని ప్రాంతంలో ఆధ్యాత్మిక చింతన మరింత పెంపొందిచే దిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన ఈ సందర్బంగా కోరారు.



# వైఎస్ షర్మిల ఎవరో తెలియదు.. వైఎస్సార్ బిడ్డయితే ఏంటి..!?

హైదరాబాద్ (వాయిస్ టుడే): వైఎస్సార్ అధినేత్రి వైఎస్ షర్మిలారెడ్డిపై ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నుంచి తప్పుకున్నట్లు షర్మిల ప్రకటన చేశారు. దీనిపై అసద్ మాట్లాడుతూ... "షర్మిల ఎవరో నాకు తెలియదు... ఎందుకు ఎన్నికల్లో పోటీ చేయడం లేదో తెలియదు. రాజశేఖర్ రెడ్డి బిడ్డ అయితే తోపా... అది ప్రజలు నిర్ణయిస్తారు" అంటూ కామెంట్స్ చేశారు. అసద్ ఇంకా మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ఎవ్వరి మద్దతు లేకుండా అధికారంలోకి వస్తుందని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. తొమ్మిది నియోజక వర్గాల్లో ఎంఐఎంకు ఓటు వేయాలని కోరారు. తెలంగాణలో శాంతి సామరస్యలు ఉండాలి అంటే అది బీఆర్ఎస్ వల్లే సాధ్యమని చెప్పుకొచ్చారు. రాజేంద్రనగర్‌లో ప్రకాష్ గౌడ్, జూబ్లీహిల్స్‌లో మాగంటి గోపీనాథ్ ఇద్దర్నీ ఓడగొడతామని స్పష్టం చేశారు. అంబర్ పేట నుంచి కిషన్ రెడ్డి పారిపోయారని.. ఎందుకు పోటీ చేయడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ హైదరాబాద్ నుండి పోటీ చేయాలన్నారు. రాహుల్ గాంధీ అమేథీలో ఓడిపోయారని.. మీడియా అందరినీ అమేథీ తీసుకుపోతే పారిపోయి వస్తారంటూ వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తామని కలలు కంటున్నారన్నారు. కాంగ్రెస్‌లో సీఎం నువ్వా నేనా అని కొట్లాడుతున్నారని అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ బీసీ కదా ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. ఇక బీసీ ముఖ్యమంత్రి అనేది ఎలా నమ్మాలని అసదుద్దీన్ నిలదీశారు.




# ఎన్నికలప్పుడు మాయ మాటలతో మభ్య పెట్టేవారిని తిప్పికొట్టండి:ఎంపీ రవిచంద్ర

**రాష్ట్రాన్ని గొప్పగా అభివృద్ధి చేసి, అద్భుతమైన మేనిఫెస్టో ప్రకటించిన కేసీఆర్ శాశ్వత ముఖ్యమంత్రిగా ఉండాలని కోరుకుందాం:ఎంపీ రవిచంద్ర**

కొత్తగూడెం (వాయిస్ టుడే): బీఆర్ఎస్ సభ సందర్భంగా ఎంపీలు రవిచంద్ర, నాగేశ్వరరావులు ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు, పినపాక, అశ్వారావుపేట ఇంఛార్జిలు సత్యనారాయణ,వెంకటరమణలతో కలిసి తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలప్పుడు డబ్బు సంచులతో వచ్చి మాయ మాటలతో మభ్య పెట్టేవారిని తిప్పికొట్టండని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ప్రజలకు పిలుపునిచ్చారు.ఇతర పార్టీల నాయకులు ఎన్నికల సమయంలో వచ్చి తమ అదృష్టాన్ని పరీక్షించుకుని నియోజకవర్గం ముఖం చూడకుండా హైదరాబాద్ నగరానికే పరిమితమవుతారన్నారు.అందుకు భిన్నంగా తమ పార్టీ ఎమ్మెల్యేలు,అభ్యర్థులు ప్రతి నిత్యం ప్రజల మధ్యనే ఉంటారని ఎంపీ రవిచంద్ర వివరించారు.ఈనెల 5వ తేదీన (ఎల్లుండి ఆదివారం) కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో జరిగే బీఆర్ఎస్ "ప్రజా ఆశీర్వాద సభ"నేపథ్యంలో ఎంపీ రవిచంద్ర లోకసభలో బీఆర్ఎస్ పక్ష నాయకులు నామా నాగేశ్వరరావు, స్థానిక ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, పినపాక, అశ్వారావుపేట నియోజకవర్గాల ఎన్నికల ఇంఛార్జిలు కోనేరు సత్యనారాయణ,ఉప్పల వెంకటరమణలతో కలిసి శుక్రవారం తెలంగాణ భవన్ లో విలేకరులతో మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి, అద్భుతమైన మేనిఫెస్టో ప్రకటించిన మహానేత చంద్రశేఖర రావు ముఖ్యమంత్రిగా శాశ్వతంగా కొనసాగితే బాగుంటుందని ఆకాంక్షించారు."ప్రజా ఆశీర్వాద సభ"లో అశేష ప్రజానీకాన్ని ఉద్దేశించి ప్రసంగించేందుకు ఈనెల మధ్యాహ్నం కొత్తగూడెం విచ్చేస్తున్న తెలంగాణ అభివృద్ధి ప్రధాత కేసీఆర్ కి మనమందరం కూడా అపూర్వ స్వాగతం పలుకుదామన్నారు.గులాబీ శ్రేణులు, అభిమానులు శ్రేయోభిలాషులు, స్థానికులు, చుట్టుపక్కల ప్రజలు స్వచ్ఛందంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చి దిగ్విజయం చేయాల్సిందిగా ఎంపీ రవిచంద్ర విజ్ఞప్తి చేశారు.కేసీఆర్ ప్రత్యక్షంగా చూసి, జనరంజకమైన ప్రసంగాన్ని వినేందుకు గాను సుమారు 80,000మంది సభకు హాజరు కానున్నారని ఎంపీ వద్దిరాజు పేర్కొన్నారు.సభికులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా అవసరమైన అన్ని ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు.అసెంబ్లీలో అందరి కంటే సీనియర్ సభ్యుడిగా ఉన్న వనమాకు ఇవే చిట్టచివరి ఎన్నికలని, నియోజకవర్గాన్ని 3,000కోట్లతో ప్రగతిపథాన పరుగులు పెట్టించిన వెంకటేశ్వరరావు కారు ఓటేసి ఘన విజయం చేకూర్చాల్సిందిగా ఎంపీ రవిచంద్ర ప్రజలను కోరారు.

# తెలంగాణ ద్రోహి జగ్గారెడ్డి.. ఎందుకు ఓటేయాలి?



సంగారెడ్డి (వాయిస్ టుడే): సర్వేలు అన్నీ కేసీఆరే హ్యాట్రిక్ సీఎం అని తేల్చాయని మంత్రి హరీష్‌రావు అన్నారు. శుక్రవారం సంగారెడ్డి బీఆర్ఎస్ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. జగ్గారెడ్డి సాధ్యం కాని హామీలు ఇచ్చారని.. గెలిచాక అడ్రస్ లేకుండా పోయారని విమర్శించారు. చింతా ప్రభాకర్ ఓడినా ప్రజల మధ్యనే ఉన్నారని తెలిపారు. తెలంగాణ ద్రోహి జగ్గారెడ్డి అంటూ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ఇస్తే భోజనం చేయాలని అనిపిస్తలే అన్న పవన్ కళ్యాణ్‌తో బీజేపీ పొత్తు పెట్టుకున్నారన్నారు. తెలంగాణా వ్యతిరేకులతో రేవంత్ రెడ్డి దోస్తీ చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ఉద్యమంలో పదవులను పట్టుకుని వేలాడారన్నారు. షర్మిలతో కాంగ్రెస్ పొత్తు పెట్టుకుంటున్నారని మంత్రి తెలిపారు.

# బాలసాని కుమారిడిని హెచ్చరిస్తూ మావో లేఖ



ములుగు (వాయిస్ టుడే): మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ నేత బాలసాని లక్ష్మినారాయణ కుమారుడు వేణును హెచ్చరిస్తూ మావోయిస్టులు లేఖ రాశారు. భూ సెటిల్మెంట్లు, గొడవలు సృష్టించి అమాయకపు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని, అమాయక మహిళలపై అత్యాచారాలకు పాల్పడుతున్నాడని పేర్కొన్నారు. డబ్బులు వసూలు చేయడమే ఇతని పనిగా పెట్టుకున్నాడని మావోయిస్టులు లేఖలో పేర్కొన్నారు. ఇప్పటికయినా తన వైఖరి మార్చుకోకపోతే బాలసాని వేణుకు.. అతని కుటుంబానికి ప్రజల చేతిలో శిక్ష తప్పదని హెచ్చరిస్తూ మావోయిస్టు పార్టీ వెంకటాపురం - వాజేడు ఏరియా కమిటీ కార్యదర్శి సుధాకర్ పేరుతో లేఖ విడుదల చేశారు.

# ఆసక్తికరంగా మునుగోడు రాజకీయం

నల్గొండ, నవంబర్ 3, (వాయిస్ టుడే): తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ మరోసారి మునుగోడు రాజకీయాలు ఆసక్తిని రేపుతున్నాయి. రోజు రోజుకు వేగంగా మారుతున్న సమీకరణాలతో ఇక్కడి రాజకీయాలు వేడెక్కుతున్నాయి. ప్రధాన పార్టీల నేతలు కండువాలు మారుస్తుండడంతో మునుగోడు రాజకీయం మరింత రసవత్తరంగా మారింది. దీంతో తెలంగాణ రాజకీయాల్లో మునుగోడు నియోజకవర్గం మరోసారి హాట్ టాపిక్ గానే మారింది.గత ఏడాది జరిగిన ఉప ఎన్నికతో మునుగోడు నియోజకవర్గం జాతీయ స్థాయి దృష్టిని ఆకర్షించింది. 2018 ఎన్నికల్లో మునుగోడు కాంగ్రెస్ నుంచి గెలిచిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి 16నెలల క్రితం కాంగ్రెస్‌కు, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి భారతీయ జనతా పార్టీలో చేరిపోయారు. దీంతో అనివార్యంగా వచ్చిన ఉప ఎన్నికలో బీఆర్ఎస్ నుంచి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి పోటీ చేసి గెలుపొందారు. బీజేపీ నుంచి పోటీ చేసిన కోమటిరెడ్డి 10 వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు. కాంగ్రెస్ నుంచి పాల్వాయి స్రవంతి పోటీ చేసి 23 వేల ఓట్లు మాత్రమే దక్కించుకున్నారు.మరీ ఈసారి ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి బరిలో ఉంటున్నారు. ఉప ఎన్నిక తర్వాత పార్టీకి అంటిముట్టన్నట్లుగా ఉన్న కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బీజేపీ అభ్యర్థిగా బరిలో ఉంటారని అందరూ భావించారు. సరిగ్గా మునుగోడులో సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు ముందు రోజు అక్టోబర్ 26వ తేదీన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బీజేపీకి గుడ్ బై చెప్పారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ కు ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్ ఎదుగుతుండడంతో సొంతగూటికి వచ్చినట్లు రాజగోపాల్ రెడ్డి చెప్పారు. ఢిల్లీలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి టికెట్ సంపాదించి మునుగోడు ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి బరిలోకి దిగారు.ఉప ఎన్నిక సమయంలో అనూహ్యంగా మునుగోడు నియోజకవర్గ కాంగ్రెస్ నేతగా.. రేవంత్ రెడ్డి అనుచరుడుగా చలమల్ల కృష్ణారెడ్డి తెరపైకి వచ్చారు. ఉప ఎన్నిక సందర్భంగానే చలమల్ల కాంగ్రెస్ టికెట్ ఆశించారు. అయితే పార్టీ సీనియర్లు పాల్వాయి స్రవంతిని పార్టీ అభ్యర్థిగా ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో టికెట్ ఇస్తామని




రేవంత్ రెడ్డి.. చలమల్ల కృష్ణారెడ్డికి హామీ ఇచ్చారట. ఉప ఎన్నిక నాటి నుంచే నియోజకవర్గంలో విస్తృతస్థాయిలో పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తూ జోష్ పెంచారు చలమల్ల. పార్టీ టికెట్ కోసం పాల్వాయి స్రవంతితో పాటు చలమల్ల కృష్ణారెడ్డి కూడా దరఖాస్తు చేసుకున్నాడు. మునుగోడు కాంగ్రెస్ అభ్యర్థిగా చలమల్ల కృష్ణారెడ్డి పోటీ చేస్తారని ప్రచారం జరిగింది.కానీ అనూహ్యంగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పార్టీలో చేరి మునుగోడు నుంచి కాంగ్రెస్ టికెట్ సంపాదించారు. దీంతో చలమల్ల కృష్ణారెడ్డి అనుచరులతో సమావేశమై అవసరమైతే రెబల్ గా పోటీ చేయాలని నిర్ణయించుకున్నారు.

బోసు రాజు లాంటి కాంగ్రెస్ పెద్దలు కూడా కృష్ణారెడ్డిని బుజ్జగించే ప్రయత్నం చేశారు. తనకు కాంగ్రెస్ టికెట్ దక్కకుండా ఎత్తుకెళ్లిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిపై చలమల్ల కృష్ణారెడ్డి రగిలిపోయాడు. చలమల్ల కృష్ణారెడ్డి.. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి కాషాయ కండువా కప్పుకున్నారు. మునుగోడు నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు కృష్ణారెడ్డి ప్రయత్నిస్తున్నారు. అయితే అనుహ్యంగా బీజేపీ విడుదల చేసిన మూడో జాబితాలో చలమల్ల కృష్ణారెడ్డికి చోటు దక్కలేదు. రేపో మాపో మునుగోడులో పార్టీ అభ్యర్థిగా కృష్ణారెడ్డిని బీజేపీ ప్రకటించే అవకాశం ఉందని వార్తలు వెలువడుతున్నాయి.అయితే ఇప్పటి వరకు మునుగోడు నుంచి బీజేపీ టికెట్ అశిస్తున్న గంగిడి మనోహర్ రెడ్డికి మరోసారి భంగపాటు తప్పదనిపిస్తుంది. ఇప్పటి వరకు టికెట్ దక్కుతుందని పెట్టుకున్న ఆశలను చలమల్ల కృష్ణారెడ్డి రూపంలో నీళ్లు చల్లినట్టు అయ్యింది. దీంతో మనోహర్ రెడ్డి తీవ్ర అసంతృప్తికి గురైనట్లు సమాచారం. రాత్రికి రాత్రే నేతలు కండువాలు మారుతుండటంతో పార్టీ శ్రేణుల్లోనూ ఆందోళన మొదలైంది. దీంతో ఒక్కసారిగా మునుగోడు రాజకీయాలు మరింత ఆసక్తిని రేపుతున్నాయి.మునుగోడు ఉప ఎన్నిక తర్వాత బీఆర్ఎస్‌తో స్నేహం బెడిసి కొట్టడంతో ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో జత కట్టాలని వామపక్షాలు భావించాయి. ఇక్కడి నుంచి గతంలో ప్రాతినిధ్యం వహించిన సిపిఐ మునుగోడు స్థానాన్ని అడిగింది. కానీ మొన్నటి వరకు నాన్చివేత ధోరణితో వ్యవహరించిన కాంగ్రెస్, రెండో జాబితాలో మునుగోడు కాంగ్రెస్ అభ్యర్థిగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని ప్రకటించింది. దీంతో ఖంగుతిన్న సిపిఐ.. మునుగోడులో ఫ్రెండ్లీ కాంటెస్ట్‌కు సిద్ధమైనట్లు సమాచారం.మరోవైపు బీఆర్ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఎన్నికల బరిలో దూసుకుపోతున్నారు. పార్టీలో వర్గపోరు ఉన్నప్పటికీ కాంగ్రెస్, బీజేపీల కంటే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ప్రచారంలో ముందున్నారు. మొత్తం మీద ఎన్నికల బరిలో నిలవబోయే అభ్యర్థులు పార్టీ కండువాలు మార్చుతుండటంతో మునుగోడు రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి.